క్లుప్తంగా

పట్టణ అభివృద్ధే ధ్యేయం

- మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిప్రసాద్



రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైస్ చైర్మన్ సాయిప్రసాద్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. పట్టణంలో 13వ వార్డులో సుధా కాలనీ ఆదిత్య స్కూల్ రోడ్డుకు సుమారు రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ చేశారు. సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కౌన్సిల్ పాలన సాగిస్తుందని, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్టు తెలిపారు. ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, రహదారి నిర్మాణాలు ముమ్మరం చేశామన్నారు. ఆయన వెంట మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్ కొట్టి పవన్‌కిశోర్ తదితరులు ఉన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ విద్యాసంస్థల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. 3 సంవత్సరాలు నిండిన చిన్నాలతో అక్షరాభ్యాసం చేయించి పాఠశాలలో చేర్పించిన వారికి అడ్మిషన్ ఫీజులో రాయితీ ఇస్తామని తెలిపారు.

మాజీ కౌన్సిలర్ తూతిక మృతి



తూతిక నూకరాజు (ఫైల్)

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ తూతిక నూకరాజు (69) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2005–10 మధ్య ఆయన కౌన్సిలర్‌గా పనిచేశారు. వైఎస్సార్ సీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీలోనే కొనసాగారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, ఆప్కో డైరెక్టర్ ముప్పన వీర్రాజు, మహారాణి సత్రం మాజీ చైర్మన్ కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన పెదపాటి బాబులు (54) ఈ నెల 15న పిఠాపురం- ఉప్పాడ రోడ్డులో తన ఇంటి వద్ద నుంచి ఎంపడల్లి జంక్షన్‌కు నడిచి వెళుతుండగా గోర్స జంక్షన్ వద్ద మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబులును చికిత్స నిమిత్తం కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు సరస్వతీ పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని సరస్వతిదేవి అమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని సరస్వతి ఆలయం వద్ద వసంత పంచమిని పురస్కరించుకొని విద్యార్థులచే సరస్వతి పూజలు జరుగుతాయని ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వర రావు ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడుతూ గురువారం ఉదయం 8.30 నిమిషాలకు విఘ్నేశ్వర పూజలు ప్రారంభించి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, సరస్వతి హోమం జరుగుతాయన్నారు.

అలరించిన వీణ కచేరీ

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు బోనాల శంకర్‌ప్రకాష్ నిర్వహించిన వీణ కచేరీ వీనుల విందుగా సాగింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిర్‌లో బుధవారం సాయంత్రం బోనాల శంకర్‌ప్రకాష్ (చెన్నై) సంగీత గాత్ర కచేరీ అలరించింది. వీరికి వయొలిన్ విద్వాంసుడు ఎం.సత్యనారాయణ శర్మ, మృదంగం విద్వాంసులు ఫాల్గుణ్, ఘటం విద్వాంసులు ఎం.హరిబాబులు చక్కని సంగీత సహకారం అందజేశారు.



పిఠాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవి, అధికారులు



పెద్దాపురంలో ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



సామర్లకోటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

ఓటు హక్కే వజ్రాయుధం

- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు
- ఓటు హక్కుపై అవగాహన కల్పించిన ఆర్డీఓ రామారావు, స్వచ్ఛంద సంస్థలు



కొత్తపల్లి మండలంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



గొల్లప్రోలులో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న అధికారులు



అమీనాబాదులో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పిఠాపురం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ హైస్కూల్ ఆవరణలో బుధవారం 'ఓటు వేయడం లాంటిది మరొకటి లేదు నేను తప్పక ఓటు వేస్తాను' అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటుహక్కు వినియోగంతోనే సమాజాన్ని మెరుగుపర్చుకోవచ్చన్నారు. పిఠాపురం నియోజకవర్గం ఎన్నికల అధికారి, గుడా వైస్ చైర్మన్ కె.సుబ్బారావు ఓటుహక్కు ఆవశ్యకతను వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని సూచించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కొత్త ఓటర్లకు ఓటరు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అధికారులు బహుమతులు అందజేశారు. అనంతరం ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తూ పట్టణంలో ర్యాలీ చేశారు. తహసీల్దారు త్రినాథరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌రావు, ఏజీపీ ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలులో తహసీల్దారు వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్ గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మానవ హారంగా ఏర్పడి ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ

పెద్దాపురం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకుని వినియోగించుకుంటే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక బ్రాహ్మణ కల్యాణ మండపంలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర అధ్యక్షతన ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు బలమైనదని, అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటు నమోదు ప్రక్రియలో నియోజకవర్గం ముందజలో ఉండడం అభినందనీయమన్నారు. ఫారం 6తో మీ సేవాలో కూడా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు, మరిడమ్మ గుడి వీధి, ఆర్టీసి కాంప్లెక్స్ మీదుగా రామారావు పేట బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి మున్సిపల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటజన్‌లను ఆర్డీఓ సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయకుమారి, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు, మహారాణి కళాశాల, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్లమూరులో..

మండలంలోని వడ్లమూరు పాఠశాలలో ఓటరు దినోత్సవం సందర్భంగా ముగ్గులపోటీలు నిర్వహించి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: పట్టణ పరిధిలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక 13వ వార్డులో కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఓటరు ప్రతిజ్ఞ చేశారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద సీనియర్ ఓటర్లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. గ్రామాల్లో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఓటర్లతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. అమీనాబాద్‌లో సర్పంచ్ నక్కా మణికంఠాబాబు ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పరిపాలన

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం
- అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజేశ్వరి అభినందన సభ



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దొరబాబు, రాజేశ్వరి తదితరులు

సామర్లకోట: ప్రజా సంకల్పయాత్ర, ఎన్నికలలో ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తూ సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం స్థానిక పాత్రుళ్లపేటలో అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఆవాల రాజేశ్వరికి రెండోసారి పర్యాయం ఇచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో బీసీలకు గుర్తింపు లభించిందన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. పార్టీకి కష్టపడి పని చేసిన ఆవాల లక్ష్మీనారాయణను గుర్తించి ఆయన సతీమణికి ఈ పదవిని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పదవిని రెండో పర్యాయం కొనసాగించడం జరుగుతోందని చెప్పారు. బీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజేశ్వరి మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలు ఓటు బ్యాంకు కాదు, బ్యాక్ బోను అని గుర్తించారని తెలిపారు. రాష్ట్ర కార్మిక నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్‌పర్సన్ గొకిన సునేత్రాదేవి, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, రెడ్డి లోవకుమారి, పిట్టా సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ, పాగా సురేష్ కుమార్, స్వయంభారపు వీరభద్రరావు, నేతల హరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు రాజేశ్వరిని అభినందించారు. రాజేశ్వరి, లక్ష్మీనారాయణ దంపతులు దొరబాబును గజమాలతో సత్కరించారు. అనంతరం ముఖ్య మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- జి.రాగంపేట గడప గడపకూ..



లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో భాగంగా బుధవారం మండలంలోని జి.రాగంపేటలో ఏఎంసీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, ఎంపీటీసీ కాలి అనురాధ, కన్వీనర్ కేఈడీ రాజు, ఎలుబండి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, మండల యూత్ అధ్యక్షులు గోపు మురళి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబుతో కలసి గడప గడపకూ తిరిగారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై గడప గడపకూ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. మీ ఇంటికి ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతి లబ్ధితో ఇంకా మీకు కావాల్సిన తీర్చాల్సిన సమస్యలు ఉంటే చెప్పాలని అడిగి తెలుసుకున్నారు. దొరబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీబీ దేవం ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, నరాలశెట్టి త్రినాథ్, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, నాగంబోయిన రాజుబాబు, వైవీకే సాయి, సిరిపురపు వడ్డికాసులు, నాళం త్రిమూర్తులు, నాళం సుబ్రహ్మణ్యం, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



సామర్లకోట ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సామర్లకోట: స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజక్టు వద్ద మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. దాంతో సామర్లకోట, కాకినాడ రూరల్, పెదపూడి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు సామర్లకోట చేరుకున్నారు. అక్రమంగా తొలగించిన అంగన్‌వాడీ కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలని, ఆయాలకు పదోన్నతులు ఇవ్వాలని, అంగన్‌వాడీ సెంటర్లలో పర్యవేక్షణ పేరుతో ఏర్పాటు చేసిన జీఎంఎస్‌కె సెల్‌లో వేసిన యాప్ డిలీట్ చేయాలని తదితర డిమాండ్లు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు వి.ఎస్తేరురాణి, ఎం.రాజేశ్వరి, డి.నాగమణి తదితరులతో పాటు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, గ్రాట్యూటీ ఇవ్వాలని కోరుతూ పెద్దాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు బుధవారం ధర్నా చేశారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద బైఠాయించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల సావిత్రి, దాడి బేబీ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు వచ్చేనెల ఆరున పీడీ, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలియజేస్తామన్నారు. అనంతరం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు.

నాటకాలను బతికించుకుందాం

- రాష్ట్రస్థాయి నాటకపోటీల్లో వక్తలు
- ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసిన నాటికలు



రెండో రోజు నాటక పోటీలు ప్రారంభిస్తున్న రంజిత్, కోటి తదితరులు



గమ్య స్థానాల వైపు నాటకంలోని సన్నివేశం

పెద్దాపురం: మండలం చంద్రమాంపల్లిలో స్నేహా ఆర్ట్స్ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి చతుర్ధ నాటక కళాపరిషత్ పోటీలు బుధవారం ఆకట్టుకున్నాయి. రెబల్‌స్టార్ కృష్ణంరాజు కళా ప్రాంగణంలో బండి సూరిబాబు కళా వేదికపై కాకినాడ ఐడియల్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్, లలితా రైస్ ఇండస్ట్రీస్ హెచ్ఆర్ విజయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనలను ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, గోగులపాటి సీతారామస్వామి, డాక్టర్ ప్రసాద్‌లు వ్యవహరించారు. స్నేహా ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశి రాజా అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు రంజిత్, ప్రజా నాట్య మండలి నాయకులు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ నాటక రంగాన్ని బతికించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆర్.వీర్రాజు, డి.కృష్ణ, డి.సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. స్నేహా ఆర్ట్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నవరం దేవస్థానంలో కళ్యాణ మండపాన్ని నిర్మించిన దాత మట్టే సత్యప్రసాద్‌ను స్నేహ ఆర్ట్స్ తరుపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిగ్గ రచన, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించిన కొలకలూరి సాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'గమ్యస్థానాల వైపు', శిష్ట చంద్రశేఖర్ నాటకీకరణ చేసి ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించిన గుంటూరు అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన 'రెండు నిశ్శబ్దాల మధ్య', తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచనలో ఆర్ఎస్ఆర్ నాయక్ దర్శకత్వం వహించిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటికను చిలుకలూరిపేటకు చెందిన అంజనా రాథోడ్ థియేటర్స్‌వారి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తాగునీరు కలుషితం



కొండెవరం శివారు ఇసుకపల్లి జంక్షన్ వద్ద వ్యర్థాలతో మూసుకుపోయిన వాల్వు చాంబర్



కొత్త ఇసుకపల్లిలో వాల్వు చాంబర్‌లో పేరుకుపోయిన చెత్త

కొత్తపల్లి: గ్రామాల్లోని తాగునీరు కలుషితమవుతోంది. నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి పథకం నుంచి గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసే ఎయిర్ వాల్వులు, చాంబర్‌లు అపరిశుభ్రంగా మారాయి. దీంతో తాగునీరు కలుషితమవుతోందని ప్రజలు చెబుతున్నారు. మండలంలోని కొండెవరం–ఇసుకపల్లి ప్రధాన పైపులైన్లలో ఏర్పాటు చేసిన చాంబర్ల వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీర్ఘకాలంగా ఉండిపోవడంతో ఆ వ్యర్థాలు కుళ్లి నీటిలో కలుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెస్‌లో ఆదిత్య విద్యార్థిని ప్రతిభ

బాలాజీచెరువు: రాష్ట్ర స్కూల్ గేమ్స్ చెస్ అకాడమీ నిర్వహించిన చెస్ పోటీల్లో ఆదిత్య గంగరాజు నగర్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మొదటి రెండు స్థానాలు సాధించారు. అండర్–15 జూనియర్స్ విభాగంలో ఎస్.దామిని నాగసాయిశ్రీలక్ష్మి మొదటి స్థానం, అండర్–17 సీనియర్స్ విభాగంలో ఎస్.కుంజల్ నాగలక్ష్మి అన్నపూర్ణ ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా వీరిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి అభినందించి జాతీయ పోటీలకు వెళ్లడంపై హర్షం వ్యక్తం చేశారు. వీరిద్దరు అక్కాచెల్లెళ్లు కావడం విశేషమని అన్నారు.

వాకాడలో చోరీ

కరప: మండలం వాకాడలో ఒక ఇంటిలో దొంగలుపడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ 20 వేలు నగదు దోచుకుపోయారు. కరప ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు వాకాడకు చెందిన అడబాల సత్తిబాబు తాపీమేస్త్రిగా పనిచేస్తుంటాడు. ఈనెల 13న సంక్రాంతి సందర్భంగా సత్తిబాబు ఇంటికి తాళంవేసి, భార్యా, పిల్లలతో సామర్లకోటలోని అత్తవారింటికి వెళ్లాడు. తిరిగి 24 మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. బుధవారం ఉదయం బీరువా తెరచి చూసుకునేసరికి బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. రెండు కాసులు బంగారు, అరకిలో వెండి సామగ్రి అపహరణకు గురైనట్టు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సచివాలయ సిబ్బంది యూనిఫాం ధరించాలి



హుస్సేన్‌పురంలోని వర్మీ కంపోస్టు యూనిట్‌ను పరిశీలించిన ఎంపీడీఓ, ఈఓ పీఆర్డీలు

సామర్లకోట: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత ఆదేశించారు. మండల పరిధిలోని పీబీ దేవం, జి.మేడపాడు, హుస్సేన్‌పురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి యూనిఫారం లేని సిబ్బందిని గుర్తించి మందలించారు. సచివాలయం నుంచి బయటకు వెళ్లే సమయంలో మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆ మూడు గ్రామాలలోని వర్మీ కంపోస్టు యూనిట్లను పరిశీలించి తడి, పొడి చెత్తలను సేకరించి వర్మీకంపోస్టు తయారు చేసి ప్రతి యూనిట్ సంపద తయారీ కేంద్రాలుగా ఉండాలన్నారు. ఈఓ పీఆర్డీ హిమమహేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.21.7 లక్షలు



అధికారుల సమక్షంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

పెద్దాపురం: స్థానిక శృంగార వల్లభుని ఆలయానికి హుండీల ద్వారా 21,70,666 రూపాయల ఆదాయం సమకూరినట్లు దేవదాయ శాఖ డీఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీ అధికారిగా ఎంఎస్ఎన్ చారిటీస్ ఏసీ పి.బాబూరావు, శ్రీభానులింగేశ్వర ఆలయ ఈఓ ఎం.వీరభద్రరావుల పర్యవేక్షణలో బుధవారం హుండీలను లెక్కించారు. ఈఓ మాట్లాడుతూ 75 రోజులకు హుండీల ద్వారా రూ.18,49,510, అన్నదానం హుండీల ద్వారా రూ. 3,21,156 ఆదాయం సమకూరిందన్నారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, కుంచే అమరావతితో పాటు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు (చిన్నా), ఆలయ సిబ్బంది, కాండ్రకోట గోదావరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, సేవా సమితి, భక్త మండలి సభ్యులు, పాటు భక్తులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు బుధవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లి శివారు రవీంద్రపురానికి చెందిన కోసిరెడ్డి శ్రీను అప్పుల బాధ తాళలేక మంగళవారం తన ఇంటి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. అస్వస్థకు గురైన శ్రీనును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తిరుపతి తెలిపారు.